వర్గ చైతన్యం

భావాలు సంఘపరిస్థితుల్ని బట్టి కలుగుతై. మొదట్లో ప్రజాసామాన్యం నూతన భావాలను స్వీకరించక ఎదురు తిరుగుతుంది. ఆ భావాలను వెలిబుచ్చినవాణ్ణి "రెటమత సిద్ధాంతి" అనీ, "వికట కవి" అనీ, ఇంకా అనేక విధాల హింసిస్తుంది. కాని క్రమేపీ ఈ నూతన భావాలు ప్రచారం లోకి వస్తయ్. ప్రజాసామాన్యం వాటిని ఆదరిస్తుంది. మరి కొన్నాళ్ళకి ఈ భావాలే సాంప్రదాయాలుగా తయారవుతై. మొదట్లో సంఘానికి మేలు చేకూర్చటానికి అంకురించిన ఈ భావాలు, సాంప్రదాయాలుగా మారింతరువాత చిట్టచి కట్టి సంఘాభివృద్ధికీ, మానవశ్రేయస్సుకీ, ఆటంకాలవుతవి. అప్పుడు విప్లవ దృక్పథం కలిగిన కవులూ రాజకీయవేత్తలూ ఆ సాంప్రదాయాల్ని బద్దలకొట్టి, సంఘాన్ని ఒక మెట్టు ముందుకు తీసుకుపోవటానికి పూనుకుంటారు. అలా చెయ్యక ఇవి మన సాంప్రదాయాలనే మోజుతో వాటినే పొగడుతూ కూర్చునేవారు మాత్రం విద్రోహులుగా నాశనకారులుగా పరిగణింప బడతారు.

సంఘాన్ని ముందుకు వెళ్ళనివ్వకుండా అరికట్టి, సహజాభివృద్ధిని ఆటంకపరచి, సంఘాన్ని కుళ్ళబెట్టటానికి పూనుకున్న ఈ సాంప్రదాయాలను బద్దలగొట్టటమే రామస్వామి చౌదరిగారు చేసినపని.

ఆనాటి సంఘంలో అగ్రజాతి మిగిలిన జాతులను బానిస జాతుల్నిగా తయారుచేసి, అజ్ఞానాన్ని పెంపొందించుకోవడమే వాటికి ధర్మంగా నిర్ణయించిపెట్టి, తన స్వలాభం కోసం పీడించటం మొదలుపెట్టింది. భిన్న నీతులు, భిన్న ధర్మాలు, భిన్న ఆదర్శాలు సృష్టించి పెత్తనం చేస్తూవుంది. చాదరిగారు అల్పసంఖ్యాకమైన ఈ వర్గంయొక్క నిరంకుశత్వానికి ఎదురుతిరిగి, ఈ నిరంకుశత్వంలో పడి నలిగిపోయే ప్రజాబాహుళ్యానికి దాస్యవిమోచనం చెయ్యటానికి కంకణం కట్టుకున్నారు. ప్రజాబాహుళ్యం ఈ దాస్యాన్ని ఎందుకు సహిస్తూవుంది? అగ్రజాతి తన అధికారాన్ని యెలా నిలబెట్టుకోగలుగుతూ వుంది ? ప్రజాబాహుళ్యం తన అద్భుతశక్తిని ఎందుకు గ్రహించుకోలేకపోతూ వుంది ? అగ్రజాతి ఏ యే యుక్తులవల్ల పెత్తనం చెయ్యగలుగుతూ వుంది ?

ఒక వర్గం అధికారంలోకి వచ్చి మిగిలిన వర్గాల్ని పీడించటం మన సంఘం యొక్క ప్రత్యేకత కాదు. దీన్ని ఆధ్యాత్మిక నాగరికత అని పొగుడుకో నక్కరలేదు. ప్రపంచ చరిత్రను చూస్తే ప్రతి దేశం ఈ అవస్థను ఎప్పుడో ఒకప్పుడు అనుభవించే వుంది. కాని ఆ యా దేశాలు పై వర్గం మీద జయప్రదంగా విప్లవాలుచేసి బానిసత్వాన్ని పోగొట్టుకో గలిగినయ్; మనం మాత్రం అందులోనే పడి కొట్టుకుంటున్నాం——! ఇంతే భేదం. అల్పసంఖ్యాకులు ఏ విధంగా ఏ యుక్తులతో, ఏ సాధనాలతో ప్రజాబాహుళ్యాన్ని దాస్యంలో వుంచి తాము పెత్తనం చెయ్యగలుగుతున్నారో విచారిద్దాం. దీనికి మూడు పద్ధతులున్నాయి—

1. తమ అధికారాన్ని నిలబెట్టే గ్రంథాలను ఆదర్శ గ్రంథాలుగా, పూజ్య గ్రంథాలుగా ప్రజలను నమ్మించటం.

2. స్వర్గం-నరకం అనే వాటిని సృష్టించి, అప్పటి సాంప్రదాయాలకు విరుద్ధంగా నడిచేవారు నరకంలో యమ యాతన అనుభవిస్తారని భయపెట్టి, అప్పటి సాంప్రదాయాలకు కట్టుబడి బానిసత్వంలో జీవితం వెళ్ళబోసుకున్న వాళ్ళకి స్వర్గసుఖాలు చేకూర్తాయని చెప్పి పూరించి, మోసం చెయ్యటం.

3. దేవుణ్ణి సృష్టించి, మిగిలిన వర్గాలకు జరిగే అన్యాయాలనూ, అక్రమాలనూ కర్మ సిద్ధాంతానికి ముడిపెట్టి, మతం అనే మత్తుమందు చల్లటం.

కనుక అగ్రజాతియొక్క అధికారాన్ని రూపుమాపాలంటే, అది ఉపయోగిస్తున్న సాధనాలను నిర్వీర్యం చెయ్యాలి. చౌదరిగారు ఇది గ్రహించి ముందు ఈ సాధనాలను ఏ విధంగా నిరుపయోగం చేశారో వివరిస్తాను—

భారత భాగవత రామాయణాలూ, ధర్మశాస్త్రాలూ, పూజ్యగ్రంథాలు కావనీ, ఒక వర్గం తన అధికారాన్ని సుస్థిరం చేసుకోటానికీ, మిగిలిన వర్గాల్ని దాస్యంలో వుంచటానికీ, వ్రాసిన గ్రంథాలనీ ప్రచారం చేశారు. రాముడికంటే రావణుడు గొప్పవా డన్నారు. పాండవులకంటే కౌరవులే నీతిపరు లన్నారు. ప్రహ్లాదుణ్ణి పితృహంతకునిగా వర్ణించారు. ఈ సందర్భంలో 'శంబుకవధ'లోని ఈ దిగువ సంభాషణ ముఖ్యంగా గమనించదగ్గది.

శంబుకుడు

కుమారా! అంగదా! నీ సంశయముల దీర్తునుగాని మన శాస్త్రములనుచుంటివి; ఎవరి శాస్త్రములని నీ ఆశయము?

అంగదుడు

ఆర్యులు చెప్పిన స్మృతు లవి.

శంబుకుడు

అవి మన వెట్లగును?

అంగదుడు

ఇందు భిన్నాభిప్రాయుండను. మన వెట్లు కావో తెలియకుంటివి.

శంబుకుడు

తెలియ జెప్పెద వినుము.

ఋషులో మరెవ్వరో వలావు రెచ్చటనో గుమిగూడి తాము క
ల్మషమతి బక్షపాతముగ లక్షల గ్రంథము వ్రాయగా నకి
ల్బిషము లటంచు నెత్తిపయి పెట్టుక పూజ యొనర్ప నేర్తుమే!
ఋషులకు మాత్ర ముండవలదే ఋజుమార్గము వాలినందనా!

ఇట్లు వ్రాయబడిన శాస్త్రములు మన శాస్త్రము లెట్లగును? మనకుగా వ్రాసిరా? మన యభిప్రాయముల గొనిరా? కానిచో మన మేల వానిచే బంధింపబడవలయు?

ఇప్పటికిప్పుడూ కొందరు, చౌదరిగారు ఈ గ్రంథాల మీద వ్రాసిన విమర్శలు చదివి ఈవిధంగా ప్రశ్నిస్తున్నారు– 'రాముడు మంచివాడు కాకపోతే పోయాడు. రావణుడు మంచివా డెలా అవుతాడు?' 'హిరణ్యకశిపుణ్ణి విష్ణువు నరసింహ రూపంలో చంపకపోతే పోయాడు, స్తంభంలో

సింహాన్ని తెచ్చి ఎలా బిగించారు?' 'పాండవులు ధర్మాత్ములు కాకపోతే పోయారు, కౌరవులెలా గొప్పవారయ్యారు?' 'పన్నెండు సంవత్సరాలు దాటితే ఈ రోజుల్లో లిమిటేషన్ పడుతుంది గాని, ఆ రోజుల్లో పాండవులకు రాజ్యార్హత లేకుండా పోవటానికి ఇది కారణం ఎల్లా అవుంది?'

ఇలా ప్రశ్నించేవారికి అసలు చౌదరిగారి పుస్తకాల్లోని ఫిలాసఫీయే అర్థం కాలేదేమో నని నా భయం. ఎందుకంటే చౌదరిగారు ఈ పుస్తకాలు రాయటానికి కారణం ఏమిటి? రావణుడు గొప్పవాడని నమ్మమనా? కాదు. హిరణ్యకశ్యపాదులు గొప్పవారని నమ్మమనా? కాదు. దుర్యోధనాదులే రాజ్యార్హులనీ పాండవులకు రాజ్యంలో హక్కు లేదనా? కాదు. మరింకేమిటి? పూజ్య గ్రంథాలనే వంకతో ప్రజాసామాన్యాన్ని బానిసత్వంలో వుంచటానికి సహాయపడే గ్రంథాలమీద పూజ్యభావం లేకుండా చెయ్యటమే, వారి రచనల ఆదర్శం—'పూజ్య గ్రంథాలయిన భారత భాగవత రామాయణాల్లోని విషయాలెంత సత్యమో, ఈ గ్రంథాల్లోని విషయాలూ అంతే సత్యం' అంటే ఆయన ఆదర్శం నెరవేరినట్లే! 'కవులు కూర్చుని ఏదైనా వ్రాస్తారు. అవన్నీ గుడ్డిగా నమ్ముతూ కూర్చుంటే ఎట్లా?' అని ప్రజాసామాన్యం అనుకుంటే ఆయన కృతకృత్యులైనట్లే! కనుక ఆయన రచనల విలువ తెలుసుకునే పద్ధతి ఆయన చెప్పిన ప్రతి ఆర్గ్యుమెంటూ తప్పా ఒప్పా, అని ఆలోచించటం కాదు—ఆయన ఈ విధంగా రాయటంవల్ల పూర్వగ్రంథాల

మీద విలువ తగ్గించా, లేదా ? అని ప్రశ్నించుకోవటం. అలా జరిగితే ఆయన సారస్వతసేవా, కృషీ, ఫలించినట్లే !

శంబూక వధలో శంబుకుడు యిలా అంటాడు: 'కవి లేఖినికి విశ్వామిత్ర సృష్టిజేయు శక్తి గలదు' కుప్పుస్వామి శతకంలో ఇదే అభిప్రాయం ఈ క్రింది పద్యరూపకంగా వెలిబుచ్చారు.

రఘుకులంబునఁ బుట్టరే రాము కన్న
గొప్పవారు ? వారల పేరు లెప్పుడైన
వింటిమే ? సత్కవి కటాక్షవితతి చేత
గొప్పవాఁడయ్యె రాముండు కుప్పుస్వామి !

అందుకనే తనకు సూత మహర్షి పురాణాలు చెప్పినట్లూ,

పాదలేపనంబు పట్టింప నలరాల
మింటి కెగసినాఁడ మంటినుండి
తెల్లవారఁబోదు దిగినాఁడ మాయూరి
చెఱువుగట్టు పోఁచి చెట్టుక్రింద

అనీ వ్రాశారు. మీకు సూతమహర్షి యెలా పురాణాలు చెప్పాడు ? పాదలేపనం రాసుకొని యెలా మింటి కెగశారు? అని ప్రశ్నిస్తే, 'పూర్వ గ్రంథాల్లోని విషయాలు నమ్మితే, ఇవీ నమ్మి ! అవి నమ్మకపోతే ఇవీ నమ్మకు !' అని జవాబు చెపుతారు.

ఇక స్త్రీ పక్షం అధికారానికీ, క్రింది వర్గాల దాస్యానికీ, కారణభూతాలైన స్వర్గనరకాలను ఏ విధంగా విమర్శించి వాటినుంచి ప్రజలనేవిధంగా రక్షించారో విచారిద్దాం.

దాగు శివ శివా, ఇది వట్టి భోగభూమి
ఉందరా దిందు మావంటి యోగులకును !

తిని తిరగటం తప్ప స్వర్గంలో మరేమీ (ఒక పని తప్ప) పని ఉండదు. ఏ సమస్యలూ వుండవు. సోమరితనం వల్ల చివికి జీర్ణించిపోయిన నాగరికతకు ఆటపట్టు అయిన స్వర్గాన్ని గురించి ఖూనీ నాటకంలో ఇలా వ్రాశారు—

వేనుడు

శునశ్శేఫా, ఇంతకును చెప్పవైతివి. ఉత్తమలోకము లనగా నేమి ? స్వైరవిహారము, సురాపానము, వృద్ధవేశ్యావనితాజనతా పొంగ వీక్షణములేనా ?....ఇవియే యైనచో ఈ భూలోకంబున దొరకవా ? విచ్చలవిడి తిరుగరాదా ? ముదుసలి పడుపుగత్తెల కౌగిళ్ళ, కులికి కులికి లాలాద్రవంబును జవిచూడరాదా.....?

ఇక ఈ స్వర్గం ఎవర్ని ఆకర్షిస్తుంది ? ఈ స్వర్గం కావాలని ఎవ్వరు ఆపేక్షపడతారు ? ఈ స్వర్గం కోసం ఎవ్వరు భౌతిక సుఖాలను వదులుకొని బానిసత్వానికి లోబడతారు ? నరకం ఎవ్వర్ని బెదిరిస్తుంది ? ఈ నరకానికి భయపడి ఎవ్వడు అగ్రజాతి నాగరికతకు లోబడి, దాస్యం చేస్తాడు ?

తరువాత అగ్రజాతి అధికారానికి మూడో సాధనమైన దేవుని యొక్క, మతం యొక్క విలువను తగ్గించటానికి చౌదరిగారు చేసిన ప్రయత్నాన్ని విచారిద్దాము—

వేనుడు

ఎవ్వడు నాకి నరకలోకము విచ్చునది ?

శునశ్శేపుడు

భగవంతుడు.

వేనుడు

ఎవ్వడీ మహానుభావుడు? ఆయన ప్రకృతి యేమి? ఇంతవర కెప్పుడును నా రాజ్యంబున గన్పట్టలేదే? ఇంతకు చెప్పవైతివి; ఆయన ఉద్యోగ మేమి?

శునశ్శేపుడు

సర్వాంతర్యామి! సర్వ ప్రపంచ సృష్టి స్థితిలయ హేతుభూతుడు. దుష్టుల శిక్షించుట, శిష్టుల రక్షించుట ఆయన ఉద్యోగము. అహోరాత్రము లీ ప్రపంచములను గనిపెట్టుకొని యుండు.

వేనుడు

పాపము ఎంత బాధపడు చుండెనో నిద్రాహారములు మాని, రేబవలు కనిపెట్టుకొని యుండి? ఆ మహామహుడేనా నాకు నరక లోకము దానము చేయునది? జీవహింస సల్పుచున్నందులకు మీకు స్వర్గము, దానిని మాపుచున్నందులకు మాకు నరకము! ఆ దేవుని మీరు క్రొత్తగా సృష్టించినటులున్నారు. ఆ మీ దేవుడు తన ధర్మమునుగూడ మరచువాడుగ నున్నాడు. ఎంతమంది దుష్టులు శిక్షను తప్పించుకొని బ్రతుకుచున్నారు. లోకమున ఎంత మంది శిష్టులు శిక్షింపబడుచున్నారు.

గౌతముడు

కటకటా! భగవానుడు కూడ నీ పరిహాసమునకు పాత్రుడయ్యె! నీకు ప్రాయశ్చిత్తమే లేనట్లున్నది.

వేనుడు

నాకు ప్రాయశ్చిత్తమే లేనట్లున్నచో నీకు చిత్తమే లేనట్లున్నది.

శునశ్శేపుడు

ఏమీ!

వేనుడు

లేనిచో దృగ్గోచరుడు కానివాడును, మానవులచే సృజింప బడిన వాడును సృష్టి స్థితి లయ కారణమేమి? సృష్టి స్థితి లయములు స్వభావ జన్యములు కావా?.

గౌతముడు

పాపము శాంతించును గాక!

వేనుడు

నీవు చెప్పిన చొప్పున భగవంతునకు నీ ప్రపంచమున నిత్యము జరుగుచున్న కార్యక్రమమునందు బెత్తనమే యున్నయెడల విన్ని ఘాతుకకృత్యము లేల జరుగుచుండును? వీని నణంచలేడా?

శునశ్శేపుడు

మానవుడు కర్మప్రేరితుడై చేయుచున్న కార్యముల నెవ్వడు మాన్పగలడు?

వేనుడు

అయినచో భగవంతుడు నిష్ప్రయోజకుండా?

గౌతముడు

నిష్ప్రయోజకుం డెట్లగును? అతడు సర్వ కర్మలకు సాక్షి.

వేనుడు

కూటసాక్షియా? ఎందుల కీ సాక్షిత్వము? తన కట్టెదుట జరుగుచున్న క్రూర కర్మముల మాన్పనేరక సాక్షియగుచున్నాడా? ఏమి చిత్రము? ఈ సాక్ష్యము యెవ్వని యెదుట ఉపయోగ పడును? ఎవ్వరికి ప్రయోజనకారి యగును? విచారణ కర్త ఎవ్వరు?.........లోకము కిన్గప్పి మీ దుర్వ్యవసాయమునకు తోడ్పడ భగవంతుని నొకని సృజించి,..లేనిపోని సర్వ శక్తులు వానికంటగట్టి, జగమును నట్టూత లూగింప యత్నించుచుంటిరి.

ఈ సందర్భంలో సూతపురాణంలోని మహోక పద్యం జ్ఞప్తికివస్తూవుంది. మొదటి ఆశ్వాసంలో—

విభుడొకడు చేయునంట పై పెత్తనంబు
కర్మ మొకడు సంసారచక్రంబు ద్రిప్పు
నంట !! ద్వంద్వ ప్రభుత్వమిం దమరలేదె ?
ఎంత కాలంబు సాగునో ఇట్టి చిట్ట !!

దైవభక్తిని గురించి కుప్పుసామి శతకంలో యీ విధంగా వ్రాశారు:—

గుడికి తరచు పోయి గొణుగు చుండెడివాడు
పెద్ద పాపమేదొ చేసియుండు
నదియె వానికట్టి యట్టిట్టు పీడింప
గుడికి పోవు నతడు కుప్పుసామి.

పాతకునిచేత నెప్పుడు గీతయుండు
మొగముపై వింత వింతగ బొట్టులుండు
చిన్నె లివియె మనస్సాక్షి సన్నగిలిన
యప్పుడు జనాళి కెందును కుప్పుసామి.

ఈ విధంగా రాసి చివ్వరికి దేవుని గురించి యీ విధంగా ముగించారు— —

మానవుడు మృగదశలో నున్నప్పుడే కొండగానో, ఏ యేరు గానో, వెలసిన దేవుడు, మానవ జ్ఞానము పరిణామము పొందు చున్నకొలది, భగవంతుడు దేరు-కొండరూపమును వదలి, మృగమై, మృగమునుండి మనుష్యుడై, మనుష్య దశనుండి యదృశ్య రూపుడై, నిరాకారుడై, నిరంజనుడై, నిర్వికల్పుడయ్యెను, ఇక తరువాత దశ యేమి ? శూన్యత్వము అనగా నాస్తికత్వము...,

ఇలా అగ్రజాతి అధికార సాధనాలను విమర్శించి హేతువాదానికి స్థానమిచ్చి, బానిస ప్రజలకు చైతన్యాన్ని కలిగించి మూఢవిశ్వాసాలను పోగొట్టి, అగ్రజాతి నిరంకుశత్వం యొక్క పునాదులను ఊడగొట్టారు.

ఇప్పటి కవులలో లేని గొప్ప విశేషం మరొకటి చౌదరి గారిలో వుంది. అదేమిటంటే సాధారణంగా మన కవులు భావాలను వెలిబుచ్చటం తప్ప వాటిని ఆచరణలో పెట్టటానికి ప్రయత్నించరు. పుస్తకాలు రాయటం తమ పనీ, కార్యాచరణకు పూనుకోవటం మరొకరి పనీ అనుకుంటారు. ప్రజాసామాన్యంతో సంబంధం పెట్టుకోటానికే ఇష్టపడరు. ప్రజాసామాన్యం నాగరికతను చూసే ఏవగించుకుంటారు. ఇక వారిలో కలిసి మెలిపి ఎలా తిరగగలరు ?

చౌదరిగారు మాత్రం అలా కాదు. ఆయన కార్యవాది. తన అభిప్రాయాలను ఆచరణలో పెట్టటానికి ప్రయత్నిస్తారు. ఆచరణ యోగ్యములు కాని భావాలవల్ల కానీ, కార్యరూపం తాల్చని అభిప్రాయాలవల్ల కానీ, సంఘానికి ఏమీ లాభంలేదని ఆయనకు తెలుసు. అందుకని రాజకీయంగా జస్టిస్ పార్టీలో చేరి కృషి చేశారు.

మన సంఘంలో, 'ఈయన జస్టిస్‌పార్టీలో చేరకుంటా వుంటేనా ?' అనే అభిమానులు చాలామంది ఉన్నారు. ఇది పొరపాటు. సిద్ధాంతరీత్యా మొదటివర్గం మీదకు మిగిలిన వర్గాల్ని విప్లవం చేయించటానికి పూనుకున్న వ్యక్తిని, క్రియల్లో మూడో వర్గాన్ని పై రెండు వర్గాలమీదకూ విప్లవం చేయించటానికి ఎందుకు పూనుకోడు ? అని ప్రశ్నిం

చటంగానీ, అలా పూనుకోవాలని వాంఛించటంగానీ కేవలం పొరపాటు. విప్లవకారుడు పరిస్థితులకు అనుకూలంగా విప్లవం లేవదియ్యాలిగాని ఊహాగానం చెయ్యగూడదు. విప్లవాలకు దగ్గరదారి లేదనే సత్యాన్ని మనం మరవగూడదు.

ఈ విషయమే విపులంగా చెబుతాను :—

మన సంఘం బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్గాలుగా విభజింప బడింది. మొదట్లో బ్రాహ్మణ వర్గం అధికారంలో వున్నప్పుడు ఆ వర్గంమీదకు మిగిలిన వర్గాలన్నీ కలిసి విప్లవం చేస్తాయి. కాని క్షత్రియ వర్గం అధికారంలోకి వస్తుంది. అప్పుడు క్షత్రియ వర్గంమీదకు మిగిలిన రెండు వర్గాలూ విప్లవం చేస్తవి. కాని వైశ్య (Capitalist) వర్గం అధికారంలోకి వస్తుంది. అప్పుడు మిగిలిన శూద్ర వర్గం పై నర్గాలమీదకు విప్లనం చేసి అధికారాన్ని వశం చేసుకుంటుంది.

కనుక మొదటి విప్లవాన్ని లేవదీసే కవినిగాని, రాజకీయ వేత్తనిగాని, రెండో విప్లవం లేవదీయ లేదనిగానీ, రెండో విప్లవానికి పూనుకున్న రాజకీయ సంస్థలో చేరలేదని గానీ, విమర్శించటం చారిత్రక జ్ఞానం లేకపోవటం. మొదటి విప్లనం జరక్కుండా రెండో విప్లవం, రెండో విప్లనం జరక్కుండా మూడో విప్లవం జరగదు గనుక, వర్గసంబంధాలను బట్టి మూడో విప్లవంవల్ల లాభంపొందే వర్గం కూడా ప్రథమంలో మొదటి విప్లవానికే సహాయం చేయవలసి వస్తుంది. ఈ దృష్టితో చూస్తే జస్టిస్‌పార్టీ ఒకప్పుడు విప్లవ సంస్థే! జస్టిస్‌పార్టీ ఒక విప్లవం నడపబట్టే యిప్పుడు మరొక విప్లవం

చేయడానికి పరిస్థితులు అనుకూలించాయని కూడా మనం మరచిపోగూడదు. చారిత్రక దృష్టి గలిగిన ఎవ్వరూ యిది కాదనలేరు.

రష్యాలో, సోషలిస్టు ఉద్యమం రావటానికి ముందు నిహిలిస్టు ఉద్యమం పనిచేసింది. ప్రజలలో వున్న మూఢ విశ్వాసాలను పోగొట్టటమే దీని ఆదర్శం. ఈ విధంగా ముందే దారిని శుభ్రపరచే ప్రయత్నం జరగటంవల్ల తరు వాత వచ్చిన సోషలిస్టు ఉద్యమం పని తేలికయింది.

ఆంధ్రదేశంలో చౌదరిగారు నిహిలిస్టులు. దేవుడు లేడనీ, మతం కుత్తుకలు కోసుకోటానికే వుపయోగ పడు తుందనీ చెప్పి, హేతువాదాన్ని ప్రచారం చేసిపెట్టి, సోష లిస్టు ఉద్యమానికి పునాది వేశారు.

చౌదరిగారు, కవిత్వంలో సంస్కృత పదాలకంటే, జాతీయ పదాలనే యెక్కువగా వాడాలని ప్రచారం చేస్తు న్నారు. ఇలాంటి ఉద్యమమే వొకప్పుడు 'ప్యూరిస్టు మూమెంట్' అనే పేరుతో ఇంగ్లండులో పుట్టింది. అప్పుడు ఇంగ్లీషుభాష, లేటిన్ భాష 'యిన్‌ఫ్లుయన్స్'లో వుండడం వల్ల, కొందరు యింగ్లీషు భాషలోనించి లేటిన్ పదాలు ఏరివెయ్యాలనే పట్టుదలతో యీ వుద్యమాన్ని లేవదీశారు. లేటిన్ భాషమీద ఏహ్యభావం కలగటానికి ఒక కారణం యిది. మతకర్తలు, లేటిన్ భాషలో దేవుడు దేవరహస్యాలు వ్రాసిపెట్టాడనీ, లేటిన్‌లో వ్రాసిన గ్రంథాలలో దేవుడు తమకు స్వర్గద్వారపు తాళపు చెవులను యిచ్చి వెళ్ళాడనీ, దేవునిచే నిర్దేశింపబడిన భాషతప్ప యితరులు ఆ గ్రంథా

లను చదవకూడదనీ చెప్పి కొన్నాళ్లు ప్రజాసామాన్యాన్ని మోసం చేశారు. కాని మోసం యెన్నాళ్లు దాగుతుంది? ప్రజలెదురు తిరిగి, 'మేం చదవకూడని భాష మాకెందుకు? మమ్మల్ని దాస్యంలో వుంచటానికి వుపయోగింపబడిన భాష మాకెందుకు? ప్రజాసామాన్యానికి అందుబాటులో లేని యీ భాష మాకెందుకు? మాకేం భాష లేదా? మాభాషలో మేం వ్రాసుకోలేమా? మా భాషలో మేం చదువుకోలేమా? మా భాషలోనే వ్రాస్తాం; సూటిగా హృదయానికి గుచ్చుకొనేటట్టు వ్రాస్తాం! శరీరం పులకరించేటట్టు వ్రాస్తాం! శౌర్యాగ్ని ప్రజ్వరిల్లేటట్టు వ్రాస్తాం. అసలు వ్రాయటానికి మా భాషే తగింది' అని పట్టుపట్టారు.

చౌదరిగారి ప్రకృతికూడా యీ విధంగానే నిష్ఠాక్టయిందని నా విశ్వాసం. అగ్రజాతి, 'సంస్కృతం దేవ భాషా, అది శూద్రులు చదవకూడదూ' అని శాసించటం వల్ల 'అసలు పరభాష మాకెందుకూ? ప్రజల హృదయాల్లో నించి వచ్చిన సజీవమైన మా భాషే మేం వ్రాసుకుంటాం' అనే పట్టుదలతో యీ వుద్యమాన్ని లేవనెత్తారు.

విప్లవం ప్రజలతో పని. ప్రజల భావాలు మారందే విప్లవంరాదు. అందుకనే ప్రతి విప్లవకారుడూ ప్రజలను అర్థమయ్యే భాషలో తన భావాలను చెప్పుకోవటం ముఖ్యావసరం. అందుకనే బుద్ధుడు సంస్కృతంలో గ్రంథాలు వ్రాయటం మానివేసి పాళీభాషలో వ్రాయించారు. అందుకనే చౌదరిగారు 'దేశ కవిత్వం రావాలి' అంటారు. జాతీయాలు వుప

ధనవంతులూ, రాజులూ, ప్రోత్సాహమిచ్చి రత్నాం బరాలిచ్చి, అడిగించుకోకుండా అగ్రహారాలిచ్చి, దినవెచ్చం పంపించి వ్రాయించిన రచనల్ని మనం చూశాం. అందులో స్వాతంత్ర్య లక్షణాలున్నాయా? వారికి తెలియకుండానే, ధన సహాయం చేసిన రాజుల రుచుల కనుకూలంగా వారిని మెప్పించటానికి రాయలేదా? కనుక ఒకవ్యక్తి ప్రోత్సాహం వల్లగానీ, రాజుల ప్రోత్సాహంవల్లగానీ వొచ్చే రచనలవల్ల ప్రయోజనం లేదు. 'రప్పించి మెప్పుమై రత్నాంబరము లిచ్చు నొసపరి దొరయైన మెసగవలయు' అని కోపక్కో నక్కరలేదు. ప్రజలే అందుకు పూనుకోవాలి. తమకు కావల సిన సారస్వతం తామే నిర్ణయించుకోవాలి. వాటి మంచి చెడ్డలను తామే విమర్శించుకోవాలి. అప్పుడుగాని ప్రజలకు వుపయోగకరమైన సారస్వతం రాదు.

చౌదరిగారు ధన్యులు. వారు వేసిన బాటనే పోతూ, వారికంటే ముందుకు సాగిపోదలచిన మనం అదృష్టవంతులం.

—o—